# సంవరణుడు

మహారాజు లందరికీ ఉండే వనవిహార లాలసత్వం సంవరణ మహారాజుకీ ఉంది. మృగయా వినోదార్థం సమీపారణ్యంలో సంచరించటం సంవరణునికి పరిపాటే. కాకులు దూరని కారడవుల్లో క్రూరజంతువుల్ని వేటాడటమే కాక, ఆ ప్రకృతి శోభను తిలకిస్తూ పరవశిస్తుంటాడు. అనంతమైన తేజస్వీ సూర్యభగవానుడుకూడా చొరలేని కీకారణ్యంలో అతను విజృంభించి వేటాడగలడు.

ఓనాడు సంవరణుడు అరణ్యంలో తిరుగాడుతుంటే కళ్ళ ముందు ఒక మెరుపు మెరిసినట్లైంది. ఆ కాంతికి అక్కడి పచ్చని ఆకులు బంగారు రంగు దాల్చాయి. ఆ సమయంలో సంవరణుడి దృష్టి మిరుమిట్లు గొలిపే అపురూప సౌందర్యవతిపై నిల్చింది.

ఆ మూర్తిని రెప్పపాటు లేకుండా, గమనించాడు సంవరణుడు. ఆమె అరణ్య ప్రాంతంలో విహరిస్తుంటే, ఆమె వెనువెంట నడిచాడు. అది కలో నిజమో అతనికి తెలియరాలేదు.

వనలక్ష్మి ఒంటరిగా విహారాని కొచ్చిందా అనుకున్నాడు కొంతసేపు. సూర్యప్రభ ఇలా భూమిమీద అవతరించిం దనిపించింది మరో నిముషం ఏ గంధర్వ కన్యో ప్రకృతి రామణీయకాన్ని తిలకించటాని కొచ్చిందేమో అనుకున్నాడు మరోసారి.

ఆమె శరీరపు బంగారు ఛాయ, మెరుపులాంటి కళ్ళకాంతి, ముగ్ధమనోహరాకృతి ఏ మానవ కన్యకూ ఉండటం అసాధ్యమనిపించి, ఆమె వెంట నడిచాడు సంవరణుడు. ఈరోజు తన పుణ్యవశాన ఈమెను చూడగలిగాడు. ఈ సుకుమారి ఈ కంటకాల మధ్య నడుస్తుంటే, ఆ ఎర్రని పాదాలు కందిపోవా? సంవరణుడు ఆపాదమస్తకం ఆమెను చూశాడు.

"ఎవరు నువ్వు? ఇలా పర్వతారణ్య ప్రాంతంలో ఒంటరిగా తిరుగుతున్నావు. ఇక్కడి క్రూర మృగాలు..."

సంవరణుని గొంతు విని వెనక్కి తిరిగింది ఆమె. అతని రూపరేఖలు ఆమెకి విస్తుగొల్పాయి. అజానుబాహుడతను. వీరత్వం అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆమె అతని వంక పరిశీలనగా చూసింది.

ఈ వ్యక్తి తనని ఇంతగా అకర్షిస్తున్నాడేమిటో? భూలోక విహారాని కొచ్చిన తను ఇతనిపట్ల ఆకర్షితురాలవటం ఆశ్చర్యమే కలిగిస్తోంది తనకికూడా. తనని ఆరాధించేవారు ఎందరో ఉన్నారు. అంతేకాదు, తన తండ్రి తేజస్సునూ, శక్తినీ చూసీ భయపడి, తనను చేరడానికి వెనుకాడే వారెందరో తెలుసు తనకి. ఆమె అలా అనుకుంటూ సంవరణుని వంక చూసింది.

ఆమె వైపు నుంచి చూపు మరల్చుకోలేక పోయాడు అతను. అతన్ని చూస్తూ ఒక్క చిరునవ్వు నవ్వింది. సంవరణుని ముఖం విప్పారింది.

అంతే, ఆమె అదృశ్యమైయింది.

సంవరణునికి ఏం చేయాలో తోచలేదు. అడవి అంతా గాలించాడు. ఆమెను ఎలా చూడగలడిక? ఆమె తండ్రి ఎవరో, ఆమె ఎక్కడుంటుందో కూడా తెలుసుకోలేకపోయాడు తను. ఆమెను చూడక తను బతకలే దనిపించి సంవరణుడు విలపిస్తూ, మూర్ఛితుడయ్యాడు. అలా అరణ్యంలో అచేతనుడై పడివున్నాడు, సంవరణుడు.

తనకై విలపిస్తున్న సంవరణుణ్ణి గగనతలం నుంచి తిలకించింది ఆమె. కేవలం దర్శన మాత్రంచేత తన కోసం పరితపిస్తున్న ఆ వ్యక్తి ఆమె మనసుకి మహాత్ముడులా కనిపించాడు. అతని స్థితి ఆమె మనసుని కలచి వేసింది. అతని పైన జాలి, ప్రేమ, గౌరవం ఒక్కసారిగా పెనవేసుకున్నాయి.

సంవరణుని ఎదుట నిల్చిందామె. ఆ అడుగుల సవ్వడికి చేతనుడై కళ్ళు తెరిచాడు సంవరణుడు. తన దేవత తన కళ్ళముందే కనబడగానే మనసు ఆనందంతో నిండిపోయింది. కళ్ళలో ఆనంద బాష్పాలు నిలిచాయి. అతని నవ యౌవన రూపం ఆమె మనసుని లోగొంటోంది. 'తనని ఇంతగా కోరే వ్యక్తిని తనూ కోరుకోవాలి.' ఆమె తన్మయత్వంతో అతని వంక చూసింది.

"ఎందుకు ఈ ఆవేదన?'' సాదరంగా అంది. ఆ మధురమైన వాక్కు పన్నీటి జల్లయింది సంవరణునికి.

"నేను మహారాజును, సంవరణుడిని. ఎందరో స్త్రీలను చూశాను. కానీ ఏనాడూ నా మనసు స్పందించలేదు. కానీ, ఏ శక్తి ప్రేరేపించిందో, నిన్ను చూసిన క్షణం నుంచి నీ రూపం, నీ సౌందర్యం నన్ను ఉన్మత్తుణ్ణి చేశాయి. నీవు అదృశ్యమైన క్షణం లోకమే శూన్యంగా కనిపించింది నాకు. నిన్ను చూడక ఒక్క-క్షణం జీవించలేను. నీ రాగ జలధిలో నన్ను ముంచివేయి."

సంవరణుని మాటలు ఆలకిస్తూ, ప్రేమ దృక్కులతో వీక్షిస్తోంది ఆమె.

"మనం గాంధర్వ వివాహం చేసుకుందాం. మనకి ఈ ప్రకృతి సాక్షిగా నిలుస్తుంది." సంవరణుడు ఆమెను ఆరాధిస్తున్నట్లుగా చూస్తూ మాటలు అనే శాడు. ఆమె మౌనం వహించింది.

వారి ప్రేమసంభాషణ విందామనే ఆసక్తితో ఉందా అన్నట్లుగా ఆ అరణ్యమంతా నిశ్శబ్దం ఆవరించింది. ఆమె వంచిన తలఎత్తి, సంవరణుని కళ్ళలోకి చూస్తూ, "నేను సూర్యభగవానుని పుత్రికను. తపతిని. నిన్ను వివాహం చేసుకోవటం కన్నా మించిన భాగ్యంలేదు నాకు. కానీ..."

సంవరణుడు భయంగా ఆమెకేసి చూశాడు. "కానీ, నేను స్వతంత్రురాలిని కాను. నా తండ్రి క్రమశిక్షణలో పెరిగినదానిని. నీ తపస్సుతో నా తండ్రిని ప్రసన్నుణ్ణి చేసుకో" తపతి సానునయంగా పలికి సూర్య మండలాని కెగసి పోయింది.

సంవరణుడు నిస్సహాయుడయ్యాడు సూర్యుణ్ణి ఎలా ప్రసన్నుని చేసు కోగలడు తను? ఆ సూర్యమండలానికెలా చేరగలడు? తపతీ వియోగం అతని మనసుని కాల్చి వేస్తోంటే, దృఢ నిశ్చయంతో కఠోర తపస్సుకు పూనుకున్నాడు సంవరణుడు. అరణ్య మధ్యంలో ఉండే, సూర్య భగవానుని కోసం తపసు ప్రారంభించాడు.

సంవరణుని తపస్సు నిరాటంకంగా కొనసాగుతోంది. తపో నిష్ఠతో, ఉపవాస దీక్షతో అతని శరీరం కృశించింది. కాలం గడుస్తోంది. ప్రియతమ శిష్యుణ్ణి చూడటానికి వచ్చిన వసిష్ఠ మహర్షి మనసుకి ఎంతో ఆవేదన కల్గింది. యోగ దృష్టితో పరిస్థితి గ్రహించాడు. తపతీ అనురాగ తప్తుడైన శిష్యుణ్ణి తను కాపాడుకోవాలి. ధర్మవిదుడూ, సద్గుణ సంపన్నుడూ అయిన తన అభి మాన శిష్యుడు సంవరణుడు క్రుశించి పోతుంటే తను సహించ లేడు. తపతీ

సంవరణుల వివాహ బాధ్యత తనే వహించాలి అనుకుని దృఢ నిశ్చయు డయ్యాడు.

మహా తపోధనుడు వశిష్ఠుడు. తపోబలంతో సూర్య మండలాన్ని చేరాడు. సంభ్రమంతో అతిథి పూజలు జరిపి వినమ్రుడై నిల్చాడు సూర్య భగవానుడు.

''తమరి రాక?'' సవినయంగా చేతులు జోడించాడు.

''ధర్మార్థ విదుడు, సద్గుణ శోభితుడు, అభిజాత్య సంపన్నుడు, నా శిష్యుడైన సంవరణుడు నీ కుమార్తె తపతికి తగిన వరుడు. నీకు కన్యాదాన ఫలం దక్కాలంటే తపతీ సంవరణ వివాహం జరిపించు.''

వశిష్ఠుని వాక్కు వేదవాక్కులా వినబడింది సూర్య భగవానునికి. అది ఆజ్ఞలా శిరసావహించాడు వెంటనే.

వశిష్ఠుని ముఖంలో ఆనంద రేఖలు వెల్లివిరిశాయి. తపతీసంవరణుల వివాహం వైభవోపేతంగా జరిగింది.

ధర్మ బద్ధుడై, సామ్రాజ్య పాలకుడై, తపతీ ప్రేమ సామ్రాజ్యాధిపతి అయి జీవితం సాగించాడు సంవరణుడు.

(ఆధారంక : విశ్వయంవారి శ్రీమదాంధ్రమహాభారతం : ఆది పర్వం : సప్తమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 17-2-1988)